ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారుల చర్యలు చేపట్టాలి..


2 లో..


తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110

# కబురు

KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 266 | మంగళవారం సెప్టెంబర్ 03 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5




2లో..

## వరద సహాయక చర్యల పరిస్థితిపై ప్రభుత్వం చర్యలు

**ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులకు ఆదేశం**

### కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సిఎం రేవంత్ సమీక్ష

కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించగా... మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ జితేందర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వరద సహాయక చర్యల పరిస్థితిపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం జిల్లాల్లో వర్ష పాతం నమోదు అయిన విషయం తెలిసిందే. వర్షాలకు పలు నదులు, వాగులు, చెరువులు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. వర్షాల కారణంగా ఇప్పటి వరకు పది మంది మృతువాత పడ్డారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలతో ఎప్పటికప్పుడు సీఎం మానిటరింగ్ చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని ప్రజలకు మరింత అందుబాటులో ఉండాలని సూచించారు. వర్షాల వల్ల నీట మునిగిన పంట పొలాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. జిల్లాల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ కోసం సచివాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 040 - 23454088 ఏర్పాటు చేశారు. భారీ వర్షాలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ... ఈ విపత్కర పరిస్దితిలో యావత్ ప్రభుత్వం ప్రజలకు అండగా నిలబడిందన్నారు.

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02

రాష్ట్ర వ్యాప్తంగా భారీగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో ఆయా ప్రాజెక్టుల గేట్లను అధికారులు ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్న పరిస్థితి. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వర్షాలతో అప్రమత్తమైన అధికారులు ప్రజలకు నష్టం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలపై సీఎం రేవంత్ రెడ్డి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు.

## వర్షాలతో 16మంది మృతి..

## ఆ కుటుంబాలను ఆదుకుంటాం



కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02

రాష్ట్రంలో వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలపై అధికారులతో సమీక్షించినట్లు తెలంగాణ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. ఎనిమిది జిల్లాలపై తీవ్ర వర్ష ప్రభావం పడిందన్నారు. వర్షాలతో ఇప్పటివరకు 16 మంది మృతి చెందారన్న ఆయన.. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. అవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు.“అధికారులంతా క్షేత్రస్థాయిలో ఉండి పరిస్థితులను సమీక్షించాలి. విద్యుత్తు, రహదారులను వెంటనే పునరుద్ధరించాలని కోరాం. రాష్ట్ర స్థాయిలో డిజాస్టర్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తాం. పది బృందాలను అత్యవసర పరిస్థితుల్లో వాడుకోవాలని నిర్ణయించాం. ప్రతిపక్ష నేతలు కూడా సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలి” అని విజ్ఞప్తి చేశారు.

## రూ.363 కోట్ల మేరకు పంచాయతీరాజ్, 500 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు ధ్వంసం

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02

రాష్ట్రవ్యాప్తంగా భారీగా కురిసిన వర్షాల కారణంగా.. మొత్తం 117 గ్రామాలకు వెళ్ళేటువంటి పంచాయతీరాజ్ రోడ్లు దెబ్బతినగా, మరో 80 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అయితే, వీటి రిపేర్ కోసం రూ.363 కోట్లు అవుతాయని ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. దాదాపు 500 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు పాడయ్యాయని తెలిపారు. అయితే, రిపేర్లు అయ్యేదాకా, గ్రామీణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా శాఖ పరంగా చేపట్టాల్సిన పనులను ప్రారంభించాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు.



2లో..



### భారీ వర్షాల ఎఫెక్ట్..

### తెలంగాణలో 1400 బస్సులు రద్దు

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02

భారీవర్షాల కారణంగా టీజీఎస్ ఆర్టీసీ తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల బస్సులను రద్దు చేసింది.హైదరాబాద్: భారీవర్షాల కారణంగా టీజీఎస్ ఆర్టీసీ తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల బస్సులను రద్దు చేసింది. ఆదివారం రాత్రి వరకు 877, సోమవారం ఉదయం నుంచి 570 కలిపి 1400కు పైగా బస్సులను రద్దు చేసింది. ముఖ్యంగా ఖమ్మం, విజయవాడ, మహబూబాబాద్ వైపుగా వెళ్లే రోడ్లన్నీ జలమయం కావడంతో ఆయా మార్గాల్లో బస్సులను పూర్తిగా రద్దు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## మృతుల కుటుంబాలకు

### రూ. 25 లక్షల పరిహారం చెల్లించాల్సిందే..

### కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన కేటీఆర్

కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02



గతంలో పీసీసీ అధ్యక్షుడి హెూదాలో రేవంత్ రెడ్డినే వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు పరిహారం అందిస్తామని చెప్పారు. ఇప్పుడు అధికారంలో ఉన్నారు. మీరు ఇచ్చిన మాటను నిలబెట్టుకొని రూ. 25 లక్షలు పరిహారం ప్రకటించండి. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాల్సిన అవసరం ఉంది. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కూడా ఇచ్చిన మాటను నిలబెట్టుకోకపోతే అంతకన్నా మోసం మరొకటి ఉండదు, ముఖ్యమంత్రి గారు అని కేటీఆర్ పేర్కొన్నారు.అదే విధంగా, వరదల కారణంగా ఇళ్లు కోల్పోయిన, డ్యామేజ్ అయిన వారికి రూ. 2.5 లక్షల నుంచి రూ. 5 లక్షల వరకు సాయం చేస్తామని చెప్పారు. ఆ హామీని కూడా నెరవేర్చండి. ప్రభుత్వం అసమర్థత, చేతగానితనం, ముందస్తు ప్రణాళిక లేకపోవడం కారణంగానే ప్రాణనష్టం జరిగింది. ఇకనైనా ప్రజల ప్రాణాలు రక్షించేందుకు చర్యలు చేపట్టి వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలకు భరోసా కల్పించండి అని కేటీఆర్ సూచించారు.

### ఇంటికన్నె-కేసముద్రం రైల్వే ట్రాక్ ధ్వంసం..

## యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు



2 లో

కబురు న్యూస్, కేసముద్రం సెప్టెంబర్ 02

తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాల కు పలుచోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. కేసముద్రం మండలంలోని ఇంటికన్నె-కేసముద్రం రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే ట్రాక్ శనివారం రాత్రి కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో పలు రైళ్లు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రైళ్ల రాకపోకలు యథావిధిగా కొనసాగించేందుకు రైల్వే అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.



2 లో

## వరదల ఎఫెక్ట్..

## 481 రైళ్లు రద్దు:

కబురు న్యూస్, సికింద్రాబాద్: సెప్టెంబర్ 02

తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు, వరదల కారణంగా 481 రైళ్లు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. మరో 152 రైళ్ల దారి మళ్లించామని, 13 రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు పేర్కొంది. కాజీపేట-డోర్నకల్, డోర్నకల్-విజయవాడ, విజయవాడ-గుంటూరు, గుంటూరు-విజయవాడ, విజయవాడ-డోర్నకల్, డోర్నకల్-కాజీపేట, సికింద్రాబాద్-సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్-షాలిమర్ తదితర రైళ్లను రద్దు చేసినట్లు తెలిపింది.

### హెలికాప్టర్ మాట్లాడకుండా.. ముఖ్యమంత్రి ఏం చేశారు ?



కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 02

భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ శేరి షుభా, గట్టు రాచందర్‌రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిన్న రోజంతా మొద్దునిద్ర పోయిందని.. గంటల తరబడి బాధితులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూశారన్నారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ వైఫల్యమేన్నారు.

2 లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

# రూ.363 కోట్ల మేరకు పంచాయతీరాజ్, 500 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు ధ్వంసం

మొదటిపేజీ తరువాయి
అయితే, ఈ నష్టం అత్యధికంగా ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో 33 గ్రామాలకు వెల్లే రహదారులు దెబ్బతినగా, కరీంనగర్లో 20 గ్రామాల రోడ్లు పాడయ్యాయి. 20 గ్రామాలకు సంబంధాలు కట్ అయ్యాయి. మహబూబ్ బాద్ లో 30 గ్రామాలు, ఉమ్మడి మెదక్ లో 8 గ్రామాలకు, నిజామాబాద్ లో 7 గ్రామాలకు, నల్గొండ లో 4 గ్రామాలకు వెల్లే రహదారులు కొట్టుకపోయాయి. ఇప్పటి వరకు క్షేత్రస్థాయి నుంచి అందిన సమాచారం మేరకు మొత్తం 117 గ్రామాలకు రాకపోకలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. చాలా గ్రామాలు నీట మునగడంతో డామేజ్ ఎక్కుగా జరిగిందని అధికారులు అంచనా వేశారు. అయితే వర్షాలు ముగిసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన గ్రామీణ రహదారుల పునరుద్ధరణ పనులను చేపట్టాలని పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. వర్షం తగ్గిన తర్వాత అంచనాలు సిద్ధం చేసి దెబ్బతిన్న గ్రామాల మరమత్తులు చేపట్టాలని ఆదేశాలు జారిచేశారు. వీలైనంత త్వరగా తాత్కలిక ప్రాతిపదికనైనా గ్రామీణ రహదారుల మరమ్మత్తులు చేపట్టి, పునరుద్దరణ పనులను పూర్తి చేస్తామని పంచాయతీరాజ్ శాఖ ఇంజినీరింగ్ విభాగం ఈఎన్సీగా కనకరత్నం తెలిపారు. వర్షం తగ్గు ముఖం పట్టగానే పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు వెల్లడించారు.

# హెలికాప్టర్ మాట్లాడకుండా.. ముఖ్యమంత్రి ఏం చేశారు ?

మొదటిపేజీ తరువాయి
సీఎం నిన్న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏం చేశారని నిలదీశారు. ప్రజలే రెస్క్యూ ఆపరేషన్ చేసుకుని ప్రాణాలు కాపాడుకున్నారని తెలిపారు. హెలికాప్టర్ కోసం ప్రయత్నం చేసినా రాలేదని ఓ మంత్రి చెబుతున్నారని.. మంత్రిగా ఫెయిల్యూర్ అయ్యారని.. రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. హెలికాప్టర్ మాట్లాడకుండా సీఎం చేశారని.. ఖమ్మంలో సహాయం కోసం ప్రజలు 9 గంటలు వేచిచూసినా సహాయం అందలేదన్నారు. ఓ మంత్రి హెలికాప్టర్ కోసం ఏపీ సీఎంతో మాట్లాడానని అన్నారని.. తెలంగాణ సీఎంతో ఎందుకు మాట్లాడలేదన్నారు. వర్షాలపై సీఎస్ హెచ్చరికను ఫాలో అయ్యి సీఎం, మంత్రులు బయటకు రాకుండా ఉన్నారా? అంటూ నిలదీశారు. పరిపాలన మాకు చేతకావడం లేదని మంత్రులు అంటున్నారని.. ప్రభుత్వానికి పరిపాలించే నైతిక హక్కు లేదన్నారు. సీఎంతో అమిత్ షా, మోదీ మాట్లాడితే తెలంగాణకు హెలికాప్టర్ కావాలని ఎందుకు అడగలేదని నిలదీశారు. ప్రభుత్వం వైపు నుంచి హెచ్చరికలు ఉంటే ప్రజలు బయటకురారని.. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులు ఉండి ఏం చేస్తున్నారని ప్రజలు అడుగుతున్నారన్నారు. మంత్రులు ఎక్కడికి వెళ్లాలన్నా హెలికాప్టర్ దొరుకుతుందని.. కానీ ప్రజలను తరలించేందుకు హెలికాప్టర్ దొరకలేదా? అంటూ ధ్వజమెత్తారు. వర్షాలతో సంభవించిన మరణాలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని.. చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 25లక్షలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలని.. ప్రభుత్వం ప్రజల మధ్యన ఉండాలన్నారు. నిన్న జరిగిన సంఘటనలకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సోయితో పని చేయాలని.. వరదలపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యల్లో ఒక్క రాజకీయ పదం కనిపించిందా..? అంటూ ధ్వజమెత్తారు. ఖమ్మంలో ప్రజలు గజఈతగాళ్లకు డబ్బులు ఇచ్చి ప్రాణాలు రక్షించుకున్నారని.. కోదాడలో ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో ఉత్తమ్ కుమార్ రెడ్డితో చర్చకు సిద్ధమన్నారు.

## సంపాదకీయం



## కలాపోసన

'ఆ.. మడిసన్నాక కూసింత కలాపోసన ఉండాలయ్యా! ఉత్తికే తిని తొంగుంటే మడిసికీ గొడ్డుకీ తేడా ఏటుంటది? '– 'ముత్యాలముగ్గు' సినిమాలో కాంట్రాక్టరు పాత్రధారి రావు గోపాలరావు ప లికిన అమృతవాక్కులివి. ముళ్లపూడి వెంకటరమణ కలం నుంచి తూటాల్లా వెలువడిన మాటలివి. తెలుగునాట అమిత జనాదరణ పొందిన పది సినిమా డైలాగుల జాబితాను ఎవరైనా రూపొందిస్తే, ఈ డైలాగుకు అందులో తప్పకుండా చోటు దక్కి తీరుతుంది. నిజమే! ఊరకే తిని తొంగున్నట్లయితే, మనిషికీ గొడ్డుకూ ఏమాత్రం తేడా ఉండదు. గొడ్డుకు లేని బుద్ధి మనిషికి ఉంది. మనిషిని ఇతర జంతుతతి నుంచి వేరు చేసేది ఆలోచనా శక్తి మాత్రమే! ఆలోచనకు పదునుపెట్టే సాధనం సృజనాత్మకత. మనిషిలోని సృజనాత్మకతకు ఫలితాలే కళలు. కొందరికి జన్మతః కళాభినివేశం ఉంటుంది. అలాంటివారు సునాయాసంగా కళలను కైవసం చేసుకోగలుగుతారు. ఇంకొందరు అభిరుచితో సాధన చేసి కళల్లో రాణిస్తారు. అభినివేశం, సాధన లేకున్నా, చాలామంది కళలను ఆస్వాదిస్తారు. కలిగిన ఆసాములు కళలను ఆదరిస్తారు. కళలు అరవై నాలుగు అని వాత్స్యాయనుడు చెప్పాడు. వీటిలో చిత్రలేఖనం, శిల్పం, సంగీతం, నృత్యం, కవిత్వం అనే అయిదు కళలూ లలితకళలుగా గుర్తింపు పొందాయి. లలితకళలు మనుషుల భావోద్వేగాల అభివ్యక్తికి అందమైన సాధనాలు. మనుషులు తమ ఆలోచనలను, ఆనంద విషాదాది భావోద్వేగాలనుబీ తమ కాల్పనిక ఊహాజగత్తులోని విశేషాలను, తమ సృజనాత్మకతను ఇతరులతో పంచుకోవడానికి కళలను ప్రదర్శిస్తారు. పురాతన నాగరికతలు ఊపిరి పోసుకోక మునుపటి నుంచే మనుషులు కళల ద్వారా తమ ఉద్వేగాలను చాటుకోవడం మొదలుపెట్టారు. మాటలాడటం ఇంకా నేర్చుకోని ఆనాటి మానవులు బొమ్మల ద్వారా తమ ఆలోచనలను వెల్లడించేవారు. పాతరాతి యుగం మానవులు రాతిగుహల గోడల మీద చిత్రించిన చిత్రాలే ఇందుకు ఆనవాళ్లు. నాగరికతలు మొదలైన నాటి నుంచి నేటి వరకు కళలకు–ముఖ్యంగా లలితకళలకు జనాదరణ ఉంది. కళలు ఏవైనా సరే, వాటి ప్రయోజనం ఒక్కటే – ఆత్మప్రక్షాళన. 'దైనందిన జీవితంలో మన ఆత్మలపై పేరుకున్న ధూళిని శుభ్రం చేయడమే కళ ప్రయోజనం' అంటాడు ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు పికాసో. కళలు భావోద్వేగాల ప్రసారమాధ్యమాలు మాత్రమే కాదు, ఆత్మప్రక్షాళనకు ఉపకరించే సాధనాలు కూడా! కళలు మనుషుల జీవితాలను సౌందర్యభరితం చేస్తాయి. కళలు విలువలు నేర్పుతాయి. దైనందిన జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లతో అలజడికి గురైన మనసుకు సాంత్వన నిస్తాయి. కళలు జీవితాన్ని చైతన్యవంతం చేస్తాయి. ఇంతేకాదు, కళలు సామాజిక అన్యాయాలను ఎత్తి చూపుతాయి. ఆలోచన రేకెత్తిస్తాయి. ఆత్మవిమర్శ దిశగా మనుషులను ప్రేరేపి స్తాయి. కళలు సమాజాన్ని మరింత నాగరికంగా, ఉన్నతంగా తీర్చిదిద్దుతాయి. సమాజంలోని రకరకాల సంస్కృతులకు చెందిన సమూహాల గుండెచప్పుడును వినిపిస్తాయి. కళలు సామాజిక మార్పులకు ఉత్ప్రేరకాలుగా పనిచేస్తాయి. 'కళ చాలా విశాలమైనది. మనుషుల తెలివి చాలా ఇరుకైనది' అంటాడు ఇంగ్లిష్ కవి అలెగ్జాండర్ పోప్. ప్రపంచం తీరుతెన్నులను చూస్తుంటే, ఆయన మాట నిజమేననిపిస్తుంది. సామాజిక మార్పులకు ఉత్ప్రేరకాలుగా పనికొచ్చే లక్షణం కళలకు ఎంతో కొంత ఉన్నమాట వాస్తవమే అయినా, ప్రపంచవ్యాప్తంగా కళాకారులు అసంఖ్యాకంగా కళాసృజన కొనసాగిస్తూ వస్తున్నా, ఈ ప్రపంచం మారాల్సిన పద్ధతిలో ఇంకా మారలేదు. మనుషుల కురచ బుద్ధులు కూడా మారలేదు. బహుశా, జనాభాలోని అత్యధికులు కళలను ఒంటబట్టించుకోకపోవడమే ఇందుకు కారణం కావచ్చు. కళలకు ఆదరణలేని దేశాలు నిరంతరం అలజడులు, అశాంతితో అలమటించే పరిస్థితులను చూస్తూనే ఉన్నాయి. అఫ్గానిస్తాన్‌లోని తాలిబన్ నాయకులు సంగీత ప్రదర్శనలపై నిషేధాజ్ఞలు విధించారు. అక్కడి పరిస్థితులు మనకు తెలియనివి కావు. చిత్రకళా ప్రదర్శనలపై నానా రకాల ఆంక్షలు ఉన్న ఉత్తర కొరియా పరిస్థితులు కూడా మనకు తెలిసినవే! స్వేచ్ఛ లేనిచోట కళలకు ఊపిరాడదు. ఇక స్వేచ్ఛే ఊపిరిగా బతికే కళాకారుల పరిస్థితి ఆంక్షలున్న చోట ఎలా ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. నియంతృత్వ దేశాల్లో మాత్రమే కాదు, ప్రజాస్వామ్య దేశాలుగా చెప్పుకుంటున్న చాలా దేశాల్లోనూ కళాకారులు పూర్తి స్వేచ్ఛను అనుభవిస్తున్న పరిస్థితులు లేవు. కళలన్నీ కళాకారుల ఆత్మావిష్కరణలే! అందుకే, 'అన్ని కళలూ కళాకారుల ఆత్మకథలే! ముత్యం ఆల్చిప్ప ఆత్మకథ' అంటాడు ఇటాలియన్ దర్శకుడు ఫెడెరికో ఫెలినీ. ఆంక్షలు లేనిచోట మాత్రమే కళాకారుల ఆత్మావిష్కరణకు అవకాశాలు అపరిమితంగా ఉంటాయి. కాల ప్రవాహంలో ప్రపంచంలోని మిగిలిన మార్పులతో పాటే కళలు కూడా మారుతూ వస్తున్నాయి. కళల్లో ప్రాచీన కళ, ఆధునిక కళ అనేవి కాలానికి సంబంధించిన కొండగుర్తులు మాత్రమే! కళల అస్తిత్వం నిరంతరం. స్వేచ్ఛలేని పరిస్థితుల వల్ల కొన్నిచోట్ల, ఆధునిక జీవనశైలిలోని తీరిక దొరకని పరిస్థితుల వల్ల కొన్నిచోట్ల మనుషులు కళలకు దూరమవుతున్నారు. దొరికే కొద్దిపాటి తీరిక సమయాన్ని టీవీ, స్మార్ట్‌ఫోన్ వంటివి అందించే యాంత్రిక వినోదంతో సరిపెట్టుకుంటున్నారు. ఫలితంగా మానసిక సమస్యలతో సతమతమవుతున్నారు. అయితే, కళాస్వాదన, కళా సాధనల వల్ల మనుషుల్లో మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇటీవల బ్రిటిష్ శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. మరందుకే మడిసన్నాక కూసింత కలాపోసన ఉండాల! లేకపోతే బతుకులు గొడ్డుదేరిపోవూ!

# ఇంటికన్నె-కేసముద్రం రైల్వే ట్రాక్ ధ్వంసం.. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు

మొదటిపేజీ తరువాయి
ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మరమ్మతు పనులు ప్రారంభించారు. ప్రత్యేక రైళ్లలో కాజీపేట నుంచి ఇసుక బస్తాలు, సిమెంట్, కంకర తెప్పిస్తున్నారు. రాత్రి, పగలు 300 మంది కార్మికులు రెండు భారీ క్రేన్ల సాయంతో పనులు కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం 50 శాతం మేరకు పనులు పూర్తి చేశారు. వాతావరణం అనుకూలిస్తే ఈ రోజు పనులు పూర్తి చేసి మంగళవారం నుంచి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించనున్నట్లు సమాచారం. దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మరమ్మతులు జరుగుతున్న రైల్వే ట్రాక్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

# వరదల ఎఫెక్ట్.. 481 రైళ్లు రద్దు:

మొదటిపేజీ తరువాయి
కేసముద్రం, ఇంటికన్నె, తాళ్లపూసలపల్లి మార్గంలో ధ్వంసమైన రైల్వేట్రాక్‌కు శరవేగంగా మరమ్మతులు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైల్వేట్రాక్ మరమ్మతు పనులకు వరద ప్రవాహం ఆటకంగా మారిందని, అయినా దాదాపు 500 మంది రైల్వే సిబ్బంది, కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యారని చెప్పారు. మరమ్మతు పనుల్ని ద.మ.రైల్వే జీఎం అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు. మంగళవారం ఉదయం వరకు రైళ్లు నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు జీఎం

# .భిమదేవరపల్లి మండలం భద్రకాళీ సమేత శ్రీ కొత్తకొండా వీరభద్ర స్వామి వారి 27 రోజుల నక్షత్ర దీక్ష మాల విరమణ సందర్భంగా స్వామి వారికి మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నక్షత్ర మాల విరమణ సందర్భంగా వీరభద్ర స్వామి దేవాలయం నుండి ఇరుముడి తో ఇతర మాలాదర స్వాములతో కాలి నడకన స్వామి వారి నామస్మరణ చేస్తూ సాహసోపేతంగా వర్షం చిరు జల్లుల మధ్య కొత్త కొండ గుట్ట పైకి ఎక్కి కుటుంబ సభ్యులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఒడితల ప్రణవ్ తో కలిసి శివలింగాన్ని దర్శించుకున్నారు...దక్ష యాగం తదనంతరం తపోవనర్థం వీరభద్రుడు అతమలింగం రూపం లో వెలిసాడు అని శాస్త్ర ప్రవచనం..అందుకే భక్తులు సంవత్సరం లో ఒక్కరోజు పొలాల అమావాస్య సందర్భంగా కొండ పై గల ఆత్మలింగానికి కాలి నడకన వెళ్లి పాడి పంటలు సమీవృద్ధి గా కలగాలి కాకతీయుల కాలం నుండి ఇక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనువాయితి..అనంతరం ప్రత్యేక పూజలు చేసి 27 రోజుల నక్షత్ర మాల విరమణ చేశారు.. ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ,హుస్నాబాద్ నియోజకవర్గ ముఖ్య నేతలు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారుల చర్యలు చేపట్టాలి..

**–భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి**

**–మంజీరా బ్యారేజ్ ను సందర్శించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ..**

రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు అవసరమైన అన్ని రకాల ముందస్తు జాగ్రత్తా చర్యలు చేపట్టాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి లతో కలిసి సంగారెడ్డి మండలంలోని మంజీరా బ్యారేజ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాల కారణంగా ప్రాణ నష్టం జరగకుండా అధికారులు తగు చర్యలు చేపట్టాలన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. జిల్లాలోని ఆందోల్, న్యాల్కల్, బొల్లారం తదితర మండలాలలో అధిక వర్షపాతం నమోదు అయినందునా ఆయా ప్రాంతాలలో శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించినట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలోని మంజీరా బ్యారేజ్ పూర్తి నీటి సామర్థ్యం ఒకటిన్నర టీఎంసీలు కాగా బ్యారేజ్ పూర్తిగా నిండడంతో ఒక గేటు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నట్లు తెలిపారు. ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో రేండు వేల మూడు వందల క్యూసెక్కులు ఉండగా అవుట్ ఫ్లో మూడు వేల ఒక్క100 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నట్లు మంత్రి తెలిపారు. దీంతో మంజీరా తీరా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. వర్షాలలో సహాయక చర్యలు చేపట్టడానికి జిల్లా స్థాయిలో సంగారెడ్డి కలెక్టరేట్లో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నట్లు తెలిపారు. కంట్రోల్ రూమ్ కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖకు సంబంధించి ప్రత్యేకంగా సంగారెడ్డిలోని ఎస్ఈ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి అవసరమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. చెరువులు, కుంటలు, వాగులలో భారీగా వరద నీరు వస్తుండడంతో నీటిపారుదల శాఖ అధికారులు అప్రమత్తమై అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులు, వాగులు, వంకల వైపు ప్రజల వెళ్లకుండా చూడాలని రెవెన్యూ, పోలీస్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై వాగులు ప్రవహిస్తున్న చోట్ల అవసరమైతే బారికేడ్లను ఏర్పాటు చేసి ప్రజలు, వాహనాలు వెళ్లకుండా జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 48 గంటల్లో కూడా భారీ వర్షాలు జిల్లాలో పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు అవసరమైతేనే బయటకు రావాలని జిల్లాలో ప్రాణనష్టం జరగకుండా అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీట మునిగిన పంట పొలాలకు, వర్షాల వల్ల కూలిన ఇండ్లకు ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా అధికారులతో భారీ వర్షాలపైసమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రూపేష్, ఇరిగేషన్ ఎస్ ఈ యేసయ్య, జిల్లా అటవి శాఖ అధికారి శ్రీధర్ రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందకపోవడమే నియోజకవర్గంలో ఈ దుస్థితి... జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్

## – ఇండ్లు లేక పూరి గుడిసెలో బిక్కుబిక్కుమంటున్న ప్రజలు

కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 2

బాన్సువాడ నియోజకవర్గంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పురాతన ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిజమైన లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతోనే వర్షాల వల్ల పేద ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ గ్రామంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక మైనార్టీ కుటుంబం తాముకుంటున్న పూరి గుడిసెలో నిలబడాల్సిన పరిస్థితి లేకపోవడంతో ఉర్దూ మీడియం స్కూల్లో తలదాచుకోవాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. అలాగే గ్రామంలో నిర్మిస్తున్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో 8 కుటుంబాలు భారీ వర్షాల వల్ల తమ ప్రాణాలను నిలబెట్టుకోవడానికి తలదాచుకోవాల్సిన అవసరం హన్మాజీపేట గ్రామంలో సుమారు 5 ఇండ్లు వర్షాలకి కూలిపోయాయి. గత ప్రభుత్వంలో అర్హులైన పేదలను గుర్తించక కేవలం తమ పార్టీ కార్యకర్తలకు అనుచరులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టబెట్టారని ప్రజలు ఆరోపిస్తున్నారు. నివసించేందుకు వీలుకాని పూరిగుడిసెలో ఉంటున్నవారు, శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో వారికి ఇండ్లను అందికపోవడం వల్ల భారీ వర్షాల వల్ల వారు ప్రాణాలు




కోల్పోవాల్సి వస్తున్న పాలకులలో సంక్షేమ పథకాలు అందజేయడంలో నాయకులు విఫలమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రాజకీయ నాయకులు ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలు నిజమైన పేదవాడికి అందించడంలో సమగ్ర సర్వే చేపట్టి నిజమైన లబ్ధిదారులకే డబల్ బెడ్ రూమ్ ఇండ్లు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

### నియోజకవర్గంలో వర్షాలకు నిలువ నీడ లేక ఇబ్బందులు పడుతున్న పేద ప్రజలు... జిల్లా కార్యదర్శి శంకర్ గౌడ్

బాన్సువాడ నియోజకవర్గంలో నిరుపేదలకు ఇవ్వాల్సిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కేవలం గత ప్రభుత్వంలో మాజీ స్పీకర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన అనుచరులకు, కార్యకర్తలకు, బాన్సువాడ పట్టణంలో స్థానికేతరులకు డబల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టబెట్టి నిరుపేదలకు అన్యాయం చేశారని బిజెపి జిల్లా కార్యదర్శి పయ్యాల శంకర్ గౌడ్ అన్నారు. నియోజకవర్గంలోని రుద్రూర్, బీర్కూర్, నసురుల్లాబాద్ మండలంలోని



మైలారంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందించకపోవడంతో భారీ వర్షాలతో ఇబ్బందులు పడుతున్న పేదలు డబల్ బెడ్ రూమ్ ఇండ్లకు తాళాలు వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. గత ప్రభుత్వంలో రాజకీయ నాయకులు అధికారులు కుమ్మక్కై నిరుపేదలకు అందాల్సిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను ధనవంతులకు, వ్యాపారస్తులకు, తమ అడుగులకు మడుగులొత్తే వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కట్టబెట్టారని ఇప్పటికైనా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవినీతిపై సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ చేపట్టి అన్హారులు ఉంటున్న ఇండ్లను జప్తు చేసుకొని అసలైన నిరుపేదలకు అందించాలని లేనిపక్షంలో బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు.

# సబ్ కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన మున్సిపల్ చైర్మన్



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 2

బాన్సువాడ సబ్ కలెక్టర్ గా ఉద్యోగ బాద్యతలు చెప్పట్టిన సబ్ కలెక్టర్ కిరణ్మయిని కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్ స్థానిక నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజల సేవలకు ,అభివృద్ధిలో తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు.తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏజజ్, బుల్లెట్ రాజు,అలిమొద్దిన్ బాబా,హకీమ్, మోహిని, రఫీక్, పంతులు నరేష్,తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి పిల్లలకు పలకలు పంపిణీ చేసిన నాయకులు



కబురు న్యూస్ వర్ని సెప్టెంబర్ 2

వర్ని మండలంలోని జాకోర గ్రామంలో సోమవారం ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కిసాన్ మోర్చా నియోజకవర్గ ఇన్చార్జ్ శనివారం కిషన్ ఆధ్వర్యంలో అంగన్వాడి పిల్లలకు పలకలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేదల పాలిట వైయస్సార్ దేవుడయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు పిట్ల సాయిలు, షేక్ రంజాన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు

# మద్నూర్ మండలానికి చెందిన యువకుడు అదృశ్యం



కబురు న్యూస్ బిచ్కుంద సెప్టెంబర్ 2

మద్నూర్ మండలంలోని చిన్నతడ్గుర్ గ్రామానికి చెందిన ఆకుల్ వార్ హనుమంతు అనే యువకుడు బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్ళగా మూడు రోజుల నుండి కనిపించడం లేదని, చుట్టుపక్కల బంధువుల ఇండ్లలో వెతికినప్పటికీ జాడ తెలియలేదని బంధువులు తెలిపారు. ఆచూకీ తెలిపిన వారు 7893537076,6301693215 ఫోన్ నెంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేసిన మండల అధ్యక్షుడు



కబురు న్యూస్ బీర్కూర్ సెప్టెంబర్ 2

బీర్కూరు మండలంలోని దామరంచ గ్రామానికి చెందిన ఆదిత్య కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 36వేల చెక్కును సోమవారం పార్టీ మండల అధ్యక్షుడు బోయిని శంకర్ స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేదలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి కాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు బోయిని శంకర్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొంతురం కాశిరాం, సొసైటీ డైరెక్టర్ రాములు లక్ష్మీనారాయణ, సాయిలు, నబీ, లక్ష్మణ్, గంగారం, పాపయ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భవానీపేట్ పోతారం గ్రామాల మధ్య కాజ్వేను మూసివేయాలి... జిల్లా కలెక్టర్



కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 2



వరద ప్రవాహం తగ్గేంత వరకు భవానిపేట్ – పోతారం గ్రామాల మధ్య కాజ్ వేను మూసివేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం పాల్వంచ మండలంలోని భవానిపేట్ – పోతారం గ్రామాల మధ్య కాజ్వే నుండి ప్రవహిస్తున్న నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక వర్షాల వలన కాజ్వే పై నుండి ప్రమాదకరంగా నీరు పారుతోందని ఎలాంటి ప్రాణనష్టం కలగకుండా నీటి ప్రవాహం తగ్గేవరకు ముందస్తుగా కాజ్ వేకు ఇరువైపులా బారికేడింగ్ ఏర్పాటు చేసి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని తహసిల్దార్ జయంత్ రెడ్డిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్, తహసిల్దార్ జయంత్ రెడ్డి,ఎంపీడీవో గోపి బాబు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ లో వైఎస్ఆర్ వర్ధంతి...





కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్02..

మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి వేడుకలను బోధన్ రెడ్డి సంఘం, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం పట్టణంలోని ఆచన్ పల్లి లో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి మాట్లాడుతూ ప్రియతమ నాయకుడు మచ్చలేని మహామనిషి వైయస్ రాజశేఖర్ రెడ్డి అని, ప్రజలకు చేరువయ్యే పలు సంక్షేమ పథకాలు ప్రారంభించి చెరగని ముద్ర వేసుకున్నారన్నారని కొనియాడారు. ప్రతి రాజకీయ నాయకుడు ఆయన అడుగు జాడల్లో నడవాలని, అలాంటి పరిపాలన అందించిన ఆయన మన మధ్య లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో సాంబిరెడ్డి, చల్ల శ్రీనివాస్ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, బలరాం రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, బ్రహ్మ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ధనుంజయ రెడ్డి, చెన్నారెడ్డి, వెంకటరామిరెడ్డి, సుందర్ రెడ్డి, ధర్మ తేజ రెడ్డి, కే.శ్రీనివాస్ రెడ్డి, రమేష్ రెడ్డి, గంగాశంకర్, పాషా మోయినుద్దీన్, నాగేశ్వర్ రావు, దాము, నరేందర్ రెడ్డి, గంగాధర్ గౌడ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగరావు.

.మెట్పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగారావు మెట్పల్లి పట్టణం .మెట్పల్లి మండలం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.అనంతరం నర్సింగరావు మాట్లాడుతూ మెట్పల్లి పట్టణం ఆరు చెక్కులు మెట్పల్లి మండలం ఎనిమిది చెక్కులకు గాను ఆరు లక్షల 28,500 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేయడం జరిగిందని పేదలు ప్రైవేటు హాస్పిటల్లో వైద్య చికిత్స నిమిత్తం వెళ్లిన వారికి ఖర్చుల్లో కొద్ది పాటు సహాయం చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ రూపంలో ఆర్థిక సహాయం చేస్తున్నదని ఇది ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు.

# బాన్సువాడ లో ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య పండుగ



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 2

బాన్సువాడ పట్టణంలో ఎడ్ల పొలాల అమావాస్య పండుగ సందర్భంగా ఎడ్లను అందంగా అలంకరించి ఎడ్లను పూజించే గొప్ప పండుగ ఎడ్ల పొలాల అమావాస్యను రైతులు పాత బాన్సువాడలోని గడి నుండి ఊరేగింపుగా బేతాళ స్వామి ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షణ నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎడ్లకు ఎంతో అనుబంధం ఉంటుందని వ్యవసాయంలోనే రైతు సంతోషంగా ఉంటారన్నారు. పాడిపంటలతో రైతుల కుటుంబాల సుఖ సంతోషాలతో ఉండాలని దేవుళ్లను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఏర్వాల కృష్ణారెడ్డి, పెద్దకాపు అర్సపల్లి గడ్డి రెడ్డి, కౌన్సిలర్ పాశం రవీందర్ రెడ్డి, వీఆర్వో సూర్యకాంత్, మాసాని రవీందర్ రెడ్డి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# వర్ష భావ పరిస్థితులను పరిశీలించిన వ్యవసాయ సలహాదారు పోచారం







కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 2

బాన్సువాడ పట్టణంలోని పలు కాలనీలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కాలనీలో పర్యటించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆయన సూచించారు. ఈ సందర్భంగా సంఘమేశ్వర్ కాలనీలోని కాల్వ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో నివసించే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నాయకులు అంజిరెడ్డి, ఎజాస్, ఉదయ్, నర్సుగొండ, కౌన్సిలర్లు లింగమేశ్వర్,వెంకటేష్, కిరణ్,హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు...






కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్02..

జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను సోమవారం బోధన్ పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. బోధన్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి, మొక్కలను నాటారు. ముందుగా పట్టణంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆయురారోగ్యాలతో, నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని మునుముందు మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం మండలంలోని బెల్లాల్ గ్రామంలో ఇళ్ళు కూలీ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉంటున్న భాధితులకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ అధ్యక్షుడు పవన్ శివ, ఉపాధ్యక్షులు రమేష్ దాస్, ప్రధాన కార్యదర్శి బాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, కార్మిక విభాగం అధ్యక్షుడు వేణు, సోషల్ మీడియా కన్వీనర్ షేక్ మొహమ్మద్, కృష్ణ, అనిల్, షాదుల్, వరుణ్, లక్ష్మణ్, జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# పునరావాస శిబిరాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 2





బిక్కనూర్ మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో ముంపుకు గురైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను, వారికోసం ఏర్పాటుచేసిన తాత్కాలిక పునరావస శిబిరాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పునరావస్వంలో ఉంటున్న ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, నాణ్యమైన ఆహారాన్ని అందిస్తూ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకునేటట్లు చూడాలని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చెరువు నీరు డబల్ బెడ్ రూమ్ ఇండ్ల వరకు చేయడానికి గల కారణాలను ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు చేరిన నీటిని మళ్లించాలని, చెరువుకు ప్రమాదం ఏర్పడక ముందే తగు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథరావు, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, పంచాయతీ అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ రవి కుమార్, ఎంపీఓ రవి కిరణ్, పోలీసు అధికారులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్ల పొలాల మాస పండుగలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్

కబురు న్యూస్ హైదరాబాద్ సెప్టెంబర్ 2





వ్యవసాయమే ప్రధాన వృత్తిగా భావించే మున్నూరు కాపులు ఎడ్ల పొలాల అమావాస్య పండుగను ప్రత్యేకంగా ప్రతి గ్రామంలో ఘనంగా నిర్వహించడం జరుగుతుందని రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. సోమవారం హైదరాబాదులోని రవీంద్రభారతిలో మున్నూరు కాపు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఏర్పాటుచేసిన ఎడ్ల పొలాల మాస పండుగ బొడ్డెమ్మ పండగ సంబరాలకు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, మున్నూరు కాపు ప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపు ఉద్యోగులు ఎడ్ల పొలాల మాస పండుగ సంబరాలలో పాల్గొనడం ఎంతో సంతోషాన్నిచ్చిందని, మున్నూరు కాపులు ఎడ్లను దైవంగా పూజిస్తూ వ్యవసాయాన్ని సాగు చేస్తారని, పదిమందికి అన్నం పెట్టే రైతన్నలు రాష్ట్రంలో పాడి పంటలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర అధ్యక్షులు ఆకుల వెంకటరావు, రాజు పటేల్, ప్రవీణ్, నాయకం శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి ప్రదీప్ పటేల్, మున్నూరు కాపు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారిని పరిశీలించిన జిల్లా కలెక్టర్



కబురు న్యూస్ బిక్కనూర్ సెప్టెంబర్ 2

బిక్కనూర్ మండలంలోని రామేశ్వరంపల్లి నుండి కామారెడ్డి పట్టణం వరకు నాలుగు వరసల జాతీయ రహదారిని సోమవారం జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్ తో ఫోన్లో మాట్లాడి అధిక వర్షాలతో జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మత్తులు చేసి వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు.

## భాధితులకు 50కేజీల బియ్యం అందజేత...



కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్02..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి బోధన్ మండలం ఊట్పల్లి గ్రామంలోని షేక్ సిరాజుద్దీన్ ఇల్లు కూలిపోయింది. స్థానికులతో సమాచారం అందుకున్న బోధన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగేశ్వర్ రావు, లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులు బస్వేశ్వర్ రావు, వై.శ్రీనివాస్, ఉమేష్ షిండే లు సోమవారం ఊట్పల్లి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కేజీ ల బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ప్రతినిధులకు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు భాదితులు కృతజ్ఞతలు తెలిపారు.

## హంగర్గా గ్రామాన్ని సందర్శించిన అధికారులు...

కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్02..



మంజీరా పరివాహక ప్రాంతమైన బోధన్ మండలంలోని హంగర్గా గ్రామాన్ని ఏసీపీ శ్రీనివాస్ తో కలిసి సోమవారం బోధన్ తహసీల్దార్ విఠల్ సందర్శించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎగువ నుండి దిగువకు వరద నీరు పోటెత్తడంతో మంజీరా పరివాహక ప్రాంత గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వరద నీటితో ముంపునకు గురయ్యే స్థానిక కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి, వసతులు సమకూర్చాలని స్థానిక పంచాయతీ కార్యదర్శికి వారు సూచించారు. రూరల్ సీఐ కోల నరేష్, ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి ఉన్నారు.

## పేద ప్రజలకు వైయస్సార్ చేసిన సేవలు మరువలేనివి... ప్రభుత్వ సలహాదారు పోచారం



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 2

బాన్సువాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి వైయస్సార్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైయస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు చేరువయ్యాయని, పేద ప్రజల గుండెల్లో వైయస్సార్ చిరస్థాయిగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి,సాహెబ్,అజీమ్, నర్సింలు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, అఫ్రోజ్, పర్వారెడ్డి, నాగులగామ వెంకన్న గుప్తా, శ్రవణ్,శ్రీనివాస్ రెడ్డి,మన్సూర్, రాజేశ్వర్ గౌడ్, భరత్ గుప్తా, మన్నె చిన్న సాయిలు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సారెస్పీని సందర్శించిన కలెక్టర్, సీపీ









### - దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశం...

కబురు న్యూస్,నిజామాబాద్, సెప్టెంబర్ 02 :
తెలంగాణలోని భారీ ప్రాజెక్టులలో ఒకటైన నిజామాబాద్ జిల్లా పోచం పాడ్ లో గల శ్రీరాంసాగర్ రిజర్వాయర్ ను సోమవారం జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సందర్శించారు. ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు పెద్ద ఎత్తున ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని పరిశీలించారు.రిజర్వాయర్లో నీటిమట్టాన్ని పరిశీలించి ప్రాజెక్టు కు చెందిన అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 .00 అడుగులు,80.00 టీఎంసిలకు గాను, ప్రస్తుతం 1088 .8 అడుగులు, 72.6 టీఎంసిల వద్ద నీరు నిలువ ఉందని అధికారులు తెలిపారు.పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువ ప్రాంతాల నుండి ప్రస్తుతం 2 లక్షల క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందన్నారు.దీంతో 40 ఫ్లడ్ గేట్ల ద్వారా దిగువ గోదావరిలోకి లక్షా 63 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నామని కలెక్టర్ కు వివరించారు. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని,ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేసి క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పరిస్థితి సమీక్షిస్తున్నామని తెలిపారు దీనిపై కలెక్టర్ స్పందిస్తూ,ప్రస్తుత లెవెల్ వద్ద నీటి నిల్వలను మెయింటైన్ చేస్తూ,ఎగువ నుండి వస్తున్న ఇన్ ఫ్లో కు అనుగుణంగా వరద జలాలను దిగువకు విడుదల చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ఏరియాలతో పాటు దిగువన గల లోతట్టు గ్రామాల పరిస్థితి గురించి కలెక్టర్ ఆరా తీశారు. ఎస్సారెస్పీ దిగువ ప్రాంతాల ప్రజలు,రైతులు అప్రమత్తంగా ఉండాలని,చేపల వేట, ఈత సరదా కోసం ఎవరు కూడా గోదావరి పరీవాహక ప్రాంతం వైపు వెళ్లకూడదని కలెక్టర్ అన్నారు. ముఖ్యంగా కొడిచెర్ల, చాకిరియాల్, సావెల్, తడపాకల్, దొంచందా, గుమ్మిర్యాల్ గ్రామాల వద్ద ఎవరు కూడా గోదావరి వైపు వెళ్లకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని, ప్రాణ నష్టం వంటి అవాంఛనీయ ఘటనలు సంభవించకుండా అవసరమైన అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అప్రమత్తతతో కూడిన చర్యలు చేపడుతున్నామని, పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ వెల్లడించారు. లో లెవల్ వంతెనలు, కాజ్ వేల మీదుగా, రోడ్ల పై నుండి వరద జలాలు ప్రవిహిస్తున్న మార్గాలలో వాహనాల రాకపోకలను దారి మళ్ళించామన్నారు. ప్రతి చోట అధికారులు, సిబ్బందిని అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామని అన్నారు. అక్కడక్కడా పురాతనమైన 32 గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, జిల్లాలో ఇంతవరకు ఎక్కడ కూడా పంటనష్టం వంటివి జరగలేదని వెల్లడించారు. ముందస్తుగానే మూడు చోట్ల లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు.ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని, ప్రజలు కూడా అప్రమత్తంగా ఉంటూ అధికార యంత్రాంగానికి సహకరించాలని కలెక్టర్ కోరారు.కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ రాజాగౌడ్, ఎస్సారెస్పీ ఎస్.ఈ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# గజ్వేల్ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం అందిస్తా... ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

### - పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుంది.. షబ్బీర్ అలీ



కబురు న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 2
గజ్వేల్ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూ%శీ%కుంట నర్సారెడ్డి నేతృత్వంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, సర్దార్ ఖాన్, త%శీ%జిముల్ మజీద్ కమిటీ చైర్మన్ మథిన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పార్టీ శ్రేణులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి తాను తప్పకుండా హాజరవుతానని స్పష్టం చేశారు. అలాగే కాంగ్రెస్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట రుణమాఫీ, ఆరు గ్యారంటీలతో పాటు ప్రతి పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యం చేయాలని సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గజ్వేల్ కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా నిరూపించాలని కోరారు. ముఖ్యంగా కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత గౌరవం, గుర్తింపు ఉంటుందని తెలిపారు. గజ్వేల్ తో తనకు ఎంతో అనుబంధం ఉందని, అలాగే అక్కడి సమస్యల పరిష్కారంలో తన వంతు భాగస్వామ్యం తప్పకుండా ఉంటుందని పేర్కొన్నారు. అవసరమైన పక్షంలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరీ చేయించుకుందామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు ఉప్పల శ్రీనివాస్ గుప్త, హరినాథ్ గుప్త, మహంకాళి శ్రీనివాస్ గుప్త, యాదగిరి, డాక్టర్ వహీద్, రామా గౌడ్, వెంకటస్వామి, నర్సింహ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నేతలు సుభాష్ చంద్రబోస్, సమీర్, రాములు గౌడ్, జహీర్, గాడిపల్లి శ్రీనివాస్, ఎక్బాల్, శివారెడ్డి, బలరాం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి



కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, సెప్టెంబర్ 02 :



ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అధికారులకు సూచించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 28 ఫిర్యాదులు అందాయి.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ తో పాటు,డీడబ్ల్యుఓ రసూల్ బీ, నిజామాబాద్ ఏ.సీ.పీ రాజా వెంకట్ రెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా,అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యా సంస్థలకు మంగళవారం కూడా సెలవు

### - కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...



కబురు న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్, సెప్టెంబర్ 02 :
భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు,కళాశాలలు,రెసిడెన్షియల్ విద్యా సంస్థలకు వరుసగా ఈ నెల 3వ తేదీన (కూడా) సెలవును ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యా సంస్థలు సెలవు పాటించాలని సూచించారు.భారీ వర్షాల కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశ్యంతో విద్యా సంస్థలకు మంగళవారం సైతం సెలవు ప్రకటించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.

# ఘనంగా పొలాల అమావాస్య

కబురు న్యూస్,బోధన్ సెప్టెంబర్ 02..



బోధన్ పట్టణంలో పొలాల అమావాస్య పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. పొలాల అమావాస్య పురస్కరించుకొని బసవన్నలను అలంకరించి అందంగా ముస్తాబు చేశారు. డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగింపుగా పట్టణంలోని పోస్ట్ ఆఫీస్ నుండి నర్సీ రోడ్డు లో గల మారుతి మందిరానికి తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి నైవేద్యం సమర్పించారు. అనంతరం డప్పు వాయిద్యాలతో రైతులు నృత్యాలు చేస్తూ బసవన్నలను ఊరేగింపుగా తమ ఇళ్లకు తీసుకెళ్లి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో మారుతి మందిరం ప్రధాన అర్చకులు ప్రవీణ్ మహారాజ్, గుండేటి శంకర్, నేపాల్ సింగ్, ఇనాని రైతులు ఉన్నారు.

# వైఎస్ఆర్ స్ఫూర్తితో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. డిసిసి అధ్యక్షులు తుంకుంటా నర్సారెడ్డి


**- ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి.... డిసిసి అధ్యక్షులు**



**కబురు న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 2**
దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. సోమవారం గజ్వేల్ లో దివంగత వైఎస్ఆర్ విగ్రహానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రూ2 లక్షల పంట రుణమాఫీ వంటి సాహసోపేత నిర్ణయాలతో కాంగ్రెస్ సర్కార్ అన్నదాతల మన్ననలు పొందుతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతి హామీ అమలుకు కట్టుబడి సీఎం రేవంత్ రెడ్డి పనిచేస్తుండగా, ప్రతి పథకం పేదలకు చేరాలన్నదే ఆయన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఖజానాను దివాలా తీయించినప్పటికీ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరుస్తూ పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ఆర్థికంగా వెనుకబడిన పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ లక్ష్యం కాగా, అద్భుత నిర్ణయాలతో రాష్ట్ర అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. చిన్న వర్షానికే జంట నగరాలు వర్షపు నీటితో నిండుతుండగా, అక్కడి ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎవరు ఊహించని విధంగా హైడ్రాను రంగంలో దింపి పరిస్థితిని చక్కదిద్దుతున్న ఘనత సిఎం రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి రైతుకు పంట రుణమాఫీ వర్తింపజేసేందుకు కాంగ్రెస్ కట్టుబడి ఉండగా, గ్రామాల్లో వ్యవసాయ అధికారులకు సహకరించి వివరాలు అందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, విజయలక్ష్మి సత్యనారాయణ, తంజీముల్ మజీద్ కమిటీ చైర్మన్ మతిన్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాములు గౌడ్, నేతలు లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, బలరాం, షరీఫ్, సుల్తాన్, జహీర్, జగ్గయ్య గారి శేఖర్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు పాఠశాలలకు సెలవు ప్రకటించిన జిల్లా కలెక్టర్

**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 2**


PROCEEDINGS OF THE DEO & EO, DPO, TSS, KAMAREDDY
Present: Sri. S. Raju, M.A., B.Ed.
Rc. No: Spl./Rain/2024 Date: 02.09.2024
Sub:- School Education, Kamareddy - Declaration of Holiday on 03.09.2024 in view of the heavy rains - Orders issued - Reg.
Ref:- 1) Instructions of the Hon'ble Collector & Dist. Magistrate, Kamareddy on Dt: 02.09.2024
&&&
ORDER:
In view of the heavy rains and as per the instruction of the Hon'ble Collector & District Magistrate, Kamareddy, Holiday is hereby declared on 03.09.2024 for all institutions i.e. Govt., Private schools & colleges, ITI, Welfare schools, Anganwadis etc., in Kamareddy district.
District Educational Officer, EO, DPO, TSS, Kamareddy
To
The all the Govt., Private schools & colleges, ITI, Welfare institutions in the Kamareddy District.
Copy to DPRO, Kamareddy for necessary action.
Copy submitted to the Collector & District Magistrate, Kamareddy for kind information
Copy submitted to the Director of School Education, TG, Hyd. for kind information

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు మంగళవారం ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ప్రభుత్వ విద్యా సంస్థలు ఆదేశాలను తప్పనిసరి పాటించాలని లేనిపక్షంలో కఠిన చర్యలు ఉంటాయన్నారు.

# ఘనంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు



**కబురు న్యూస్ బీర్కూరు సెప్టెంబర్ 2**
బీర్కూరు మండల కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు కేక్ కట్ చేసి, టపాకాయలు కాలుస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హీరోగా పవన్ కళ్యాణ్ ప్రజలను అలరించి, రాజకీయాలు తనకంటూ ఒక ముద్ర వేసుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా ప్రజలకు సేవలందిస్తూ భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదిగి ప్రజలకు మరిన్ని సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ అభిమాన సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కొరకు కుటుంబ నిర్ధారణ చేసుకోవాలి.. ఎడిఏ బాబు నాయక్





**కబురు న్యూస్ గజ్వేల్ సెప్టెంబర్ 2**

పంట రుణమాఫీ వర్తించని రైతుల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఎడిఏ బాబు నాయక్ అన్నారు. సోమవారం గజ్వేల్ రైతు వేదికలో ఏర్పాటుచేసిన సమావేశంలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ వివిధ కారణాలతో పంట రుణమాఫీ వర్తించని అర్హులైన రైతులకు న్యాయం జరగాలనే లక్ష్యంతో వ్యవసాయ సిబ్బంది, అధికారులు గ్రామాల్లో రైతుల నుండి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో ప్రతి రైతును కలుస్తూ అవసరమైన వివరాలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కాగా గజ్వేల్ వ్యవసాయ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాక, కూకూనుర్ పల్లి, రాయిపోల్ మండలాల పరిదిలోని గ్రామాల్లో ముందస్తు సమాచారంతో రైతు కుటుంబాల (ఫ్యామిలీ గ్రూఫింగ్ ) ఫోటోలు తీసుకుని అక్కడికక్కడే ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్ లో నమోదు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. తాము పొందుపరిచిన వివరాల ఆధారంగా అర్హతలను బట్టి రుణమాఫీ డబ్బులు సంబంధిత రైతు ఖాతాలో జమ అవుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి నాగరాజు, రిటైర్డ్ ఎంపీడీవో బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# గెజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడిగా నీలం లింగం ఏకగ్రీవ ఎన్నిక





**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 2**
కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగ భవన్లో సోమవారం రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం, జిల్లా శాఖ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ గంగారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఐక్యమత్యంతో కలిసి ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం జిల్లా కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నీలం లింగం, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణ, కోశాధికారిగా రామస్వామిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నీలం లింగం మాట్లాడుతూ తనపై నమ్మకంతో మరోసారి జిల్లా అధ్యక్షుని ఎన్నుకున్నందుకు సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిలర్స్ శ్రీనాథ్, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, మోహన్, నరేష్, ద్రుపత్ కుమార్, బాన్సువాడ మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# వరద ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మన అందరిదీ.. ఎమ్మెల్యే**





**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 2**
గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్, జి ఆర్ కాలనీ ముంపు ప్రాంతాలను సోమవారం ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణ రెడ్డి పరిశీలించి కాలనీవాసుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని సైలాన్ బాబా కాలనీ, టీచర్స్ బతుకమ్మ కుంట, హరిజన వాడ, పంచముఖి హనుమాన్, అయ్యప్ప కాలనీలలో ముంపునకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గంలోని చెరువులో వాగులు పొంగిపొర్లుతున్నాయని అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇండ్ల నుండి బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. వరద ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలు చేపడుతున్న అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ శ్రేణులు నియోజకవర్గంలోని ప్రజలకు వర్షాల వల్ల ఇబ్బందులు కలగకుండా సహాయక చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు.

# విజయవాడను ముంచెత్తుతున్న వరద

## ప్రకాశం బ్యారేజీవద్ద కృష్ణమ్మ ఉగ్రరూపం

## నాలుగు బోట్లు కొట్టుకు వచ్చినట్లు గుర్తింపు

**ఆంధ్రప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షానికి ప్రకాశం బ్యారేజ్ రికార్డు స్థాయిలో వరద వచ్చి చేరుతోంది.**

**దీంతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చిన పరిస్థితి.**

**ఈ వరద ఉధృతిలో పెద్ద ఎత్తున బోట్లు కొట్టుకొస్తున్నాయి.**



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 02

తొలుత ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీ వైపు ఒక బోటు కొట్టుకొచ్చింది. వేగంగా వచ్చిన బోటు ప్రకాశం బ్యారేజీ గేటు 69ను ఢీ కొన్నది. ఈ ఘటనలో గేటు లిఫ్ట్ చేసే ప్రాంతంలో డ్యామేజీ అయ్యింది. అసలేం జరిగిందని తెలుసుకునే లోపే.. మరోసారి నాలుగు బోట్లు కొట్టుకొని వచ్చాయి. దీంతో అధికారులు అనుమానాలు మొదలయ్యాయి. ఇదంతా పనిగట్టుకుని ఎవరైనా చేస్తున్నారా..? లేకుంటే వేరే ప్రాంతం నుంచి వస్తున్నాయా..? దీని వెనుక ఏమైన కుట్ర ఉందా..? ఒకవేళ కుట్రే అయితే ఎవరి పని..? అనేది తెలుసుకునే పనిలో అధికారులు నిమగ్న మయ్యారు. ఈ క్రమంలో గతంలో జరిగిన పరిణామాన్ని అధికారులు, జనాలు గుర్తు తెచ్చుకుంటున్నారు. అప్పట్లో మాజీ సీఎం చంద్రబాబు నాయుడు నివాసాన్ని ముంచేందుకు బోటు అడ్డు తగిలిందంటూ నీటి ప్రవాహాన్ని పెంచే ప్రయత్నం వైసీపీ ప్రభుత్వం చేసిన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఇప్పుడు కూడా బ్యారేజీని డ్యామేజీ చేయడానికి అలాంటి ప్రయత్నం ఏమైనా జరిగిందా..? ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావడానికి ఇలాంటి పనులు చేస్తున్నారా..? ఈ మొత్తం వ్యవహారం ఒకవేళ ఇదే నిజమైతే దీని వెనుకున్న సూత్రదారులు ఎవరు..? పాత్రదారులు ఎవరు..? అనే అనుమానాలు వస్తున్నాయి.

ఈ ప్రమాదంపై ఇరిగేషన్, రివర్ కన్జర్వేటివ్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేపడుతున్నారు. ఇదిలా ఉంటే.. వరద సహాయక చర్యలపై సోమవారం ఉదయం నుంచే సీఎం చంద్రబాబు రివ్యూలు మొదలుపెట్టారు. ఆహారం, బోట్స్ ఎంతవరకు చేరుకున్నాయి..? అని సమీక్షించారు. మరోవైపు.. ఇతర రాష్ట్రాల నుంచి విజయవాడకు పవర్ బోట్స్ చేరుకుంటున్నాయి. సింగ్ నగర్ ప్రాంతంలో ప్రస్తుత పరిస్థితి, సహాయక చర్యలపై సీఎం రివ్యూ చేస్తున్నారు. తెల్లవారు జామున 4 గంటల వరకూ ఉమ్మడి కృష్ణా జిల్లాలోని వివిధ వరద ప్రాంతాల్లో సీఎం పర్యటించిన సంగతి తెలిసిందే. సోమవారం ఉదయం కూడా జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి మళ్లీ ఫీల్డ్ విజిట్‌కు చంద్రబాబు వెళ్లారు. ప్రకాశం బ్యారేజీకి 11 లక్షల 20 వేల క్యూసెక్కులకు వరద చేరుకుంది. బ్యారేజి మొత్తం గేట్లు ఎత్తి కిందకు వరద నీటిని విడుదల చేశారు. బ్యారేజి చరిత్రలో తొలిసారిగా రికార్డ్ స్థాయిలో వరద వచ్చి చేరింది. 2009 అక్టోబర్‌లో 10 లక్షల 94 వేల క్యూసెక్కుల వరద వచ్చింది. 1903 వ సంవత్సరంలో 10 లక్షల 60 వేలు క్యూసెక్కుల వరద వచ్చి చేరుకుంది. బ్యారేజి దిగువ భాగాన అనేక గ్రామాలు నీట మునిగి పోయాయి. బ్యారేజిపై రాకపోకలు నిలిపివేసే అవకాశం ఉంది. ప్రకాశం బ్యారేజ్ గేట్లను పూర్తిగా పైకి ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు.

ప్రకాశం బ్యారేజీ వద్ద ఎప్పుడు లేని విధంగా 23.6 అడుగుల మేర వరద నీరు ప్రవహిస్తోంది. ప్రకాశం బ్యారేజీ ఇన్ ఎలో అవుట్ ఫ్లో 11,25,876 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుకుంది. రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రకాశం బ్యారేజీకి రికార్డు స్థాయి వరద వచ్చి చేరుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ప్రకాశం బ్యారేజ్ గేట్లను పూర్తిగా పైకి ఎత్తి అధికారులు నీటిని విడుదల చేశారు. దీంతో రైల్వే అధికారులు అప్రమత్తమ య్యారు. కృష్ణ కెనాల్ జంక్షన్ నుంచి కృష్ణా నది మీదుగా రైళ్లను డెడ్ స్లో చేసి రైల్వే అధికారులు నడుపుతున్నారు. ప్రకాశం బ్యారేజ్ వద్ద పోలీసులు రాకపోకల ఆంక్షలు విధించారు. హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారిపై అంబర్ పేట , ఐతవరం కీసర వద్ద జాతీయ రహదారిపై వరద నీరు వచ్చి చేరుతోంది. హైదరాబాద్, విజయవాడ మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. కృష్ణా జిల్లా నాగాయలంక వద్ద నదిలో పడవ బోల్తా పడింది. ఈ పడవలో నలుగురు మత్స్యకారులు ఉన్నారు. వారి అరుపులు, కేకలు విన్న మత్స్యకార యువత.. నదిలో కొట్టుకుపోతున్న వారిని పడవల్లో వెళ్లి కాపాడారు. నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం తప్పటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. నదిలో కట్టివేసి ఉన్న పడవ కోసం పోలీసుల కన్నుగప్పి నదిలోకి మత్స్యకారులు వెళ్లడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పడవ మునిగి పోవడాన్ని స్థానిక మత్యకారులు గమనించి వెంటనే కాపాడటంతో పెను ముప్పు తప్పినట్లయ్యింది. ప్రకాశం బ్యారేజి నుంచి రికార్డు స్థాయిలో వరద నీరు వచ్చి చేరుతుండటంతో రామలింగేశ్వర నగర్ మునిగిపోయింది. ఇళ్లను ఖాళీ చేసి ప్రజలు బయటకి వస్తున్నారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో నిన్నటి వరకూ ప్రజలు క్షేమంగానే ఉన్నారు. అయితే శ్మశానం రోడ్ వద్ద గోడ్ పై నుంచి లోపలకు వరద నీరు వచ్చి చేరింది. మొత్తం వెనక్కి తన్నడంతో నీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. ఈ క్రమంలోనే దివిసీమను సైతం వరద తీవ్రత తాకింది. పులిగడ్డ వద్ద 21 అడుగులకు వరద మట్టం చేరుకుంది. పులిగడ్డ అక్విడెక్టు.. వరద నీటిలో చిక్కుకు పోయింది. మోపిదేవి మండలం కే కొత్త పాలెం ఎస్సీ వాడలోకి వరద నీరు వచ్చి చేరుకుంది. కాలనీలో నివాసం ఉంటున్న 600 మందిని సురక్షిత ప్రాంతాలకు అధికారులు తరలించారు. అవనిగడ్డ మండలం పులిగద్ద పళ్ళిపాలెంలోకి సైతం వరద నీరు క్రమక్రమంగా చేరుతోంది.

# మోకాలి లోతు నీటిలో కాలినడకన..

## 4 గంటలపాటు నిర్విరామంగా చంద్రబాబు పర్యటన

**నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది. సోమవారం ఉదయం నుంచి ముంపు ప్రాంతాల్లో సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామంగా సీఎం పర్యటించారు.**



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 02

నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన ముగిసింది. సోమవారం ఉదయం నుంచి ముంపు ప్రాంతాల్లో సుమారు నాలుగు గంటల పాటు నిర్విరామంగా సీఎం పర్యటించారు. యనమలకుదురు, పటమట, రామలింగేశ్వర నగర్, జక్కంపూడి, భవానీపురం తదితర ప్రాంతాల్లో సీఎం పర్యటించి బాధితులతో మాట్లాడారు. ప్రకాశం బ్యారేజీ దిగువ లోతట్టు ప్రాంతాలు, ఎగువ ప్రాంతాల్లోనూ పర్యటించారు. వాహనం వెళ్లగలిగినంత దూరం అందులో.. మిగిలిన చోట్ల కాలినడక వెళ్లారు. కొన్నిచోట్ల మోకాలి లోతు నీటిలోనూ నడుచుకుంటూ వెళ్లారు. బురదలో కాలినడకనే తన పర్యటనను కొనసాగించారు. మరింత ఎక్కువ నీరు ఉన్న ప్రాంతాల్లో బోటు ద్వారా బాధితుల వద్దకు చేరుకుని వారితో స్వయంగా మాట్లాడి కష్టాలు తెలుసుకున్నారు. బాధితులు చెప్పే ఫిర్యాదుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం ఆదుకుంటుందని.. ధైర్యంగా ఉండాలంటూ ప్రజల్లో భరోసా కల్పించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన ముగిసిన అనంతరం విజయవాడ కలెక్టరేట్‌లో మంత్రులు, అధికారులతో సీఎం మరోసారి సమీక్ష నిర్వహించారు. సహాయక చర్యల్లో వేగం పెంచి ప్రజలకు భరోసా ఇచ్చినట్లు చెప్పారు. ఊహించని విపత్తు నుంచి ప్రజలను త్వరగా కాపాడాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రత తమ బాధ్యత అని, బాధితులు ధైర్యంగా ఉండాలని కోరారు. సోమవారం ఉదయం అధికారులతో

# విజయవాడకు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు




ప్రత్యేక విమానంలో పవర్ బోట్లు రాకసిఎం చంద్రబాబు వినతితో స్పందించిన కేంద్రం

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 02

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రయత్నం ఫలించింది. విజయవాడకు పవర్ బోట్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. కేంద్రంతో చంద్రబాబు సహాయక చర్యల విషయమై మాట్లాడారు. పవర్ బోట్స్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఏపీకి పంపించాలని కోరారు. దీంతో వివిధ రాష్ట్రాల నుంచి విజయవాడకు కేంద్రం బోట్స్‌ను పంపించింది. మరోవైపు లుధీయానా నుంచి ఆర్మీ విమానంలో గన్నవరం విమానాశ్రయానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు చేరుకున్నాయి. అక్కడి నుంచి ఆర్మీ హెలికాప్టర్‌లో బొట్లతో విజయవాడ వరద ప్రాంతాల్లోకి వెళ్లాయి. సుమారు 100 మందితో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు విజయవాడకు చేరుకున్నాయి. బోట్స్ ద్వారా సింగ్ నగర్ ముంపు ప్రాంతంలో ఆహారం పంపిణీ చేయడం జరిగింది. పెద్ద ఎత్తున బోట్స్ రావడంతో ఇళ్ల నుంచి బాధితులను బయటకు తెచ్చే పనులను వేగవంతంచేయడం జరిగింది. పునరావాస కేంద్రాలకు వెళ్లే వాళ్లకు దుస్తులు కూడా ఇవ్వాలని సీఎం సూచించారు. పాల ప్యాకెట్లు, ఆహారం, నీళ్ళ బాటిల్స్‌ను ప్రభుత్వం అందిస్తోంది. ప్రైవేటు హోటల్స్, దుర్గ గుడి, అక్షయ పాత్రల ద్వారా ప్రభుత్వం ఆహారం సమకూర్చుతోంది. ముంపు ప్రాంతాల్లో మరోసారి పర్యటనతో సహాయక చర్యలను చంద్రబాబు పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి నిరంతర సమీక్షలు, మానిటరింగ్ సత్ఫలితాన్నిస్తున్నాయి. చంద్రబాబు సూచనలతో అధికార యంత్రాంగం సైతం చురుకుగా పనులు నిర్వర్తిస్తోంది. నిరంతర పర్యవేక్షణతో ఉదయం వరకూ ఆహారం సిద్ధం చేసి అధికారులు పంపిణీ చేస్తున్నారు. స్వయంగా ముఖ్యమంత్రి ముంపు ప్రాంతాల్లో రాత్రంతా తిరగడంతో వేగం పుంజుకుని సహాయక చర్యలను

# వర్షాల వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి... సీఐ జగడం నరేష్




కబురు న్యూస్ బిచ్కుంద సెప్టెంబర్ 2

బిచ్కుంద సర్కిల్ పరిధిలోని ప్రజలు గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై నీరు పారేటప్పుడు వాహనాలు తీసుకువెళ్లరాదని బిచ్కుంద సీఐ జగడం నరేష్ అన్నారు. సోమవారం ఆయన కబురు ప్రతినిధితో మాట్లాడుతూ శిధిలావస్థలో ఉన్న ఇండ్లలో ప్రజలు నివసించరాదని సురక్షిత ప్రాంతాలలో ఉండాలన్నారు. చెరువులు నీటి కుంటలు వాగుల వద్దకు యువకులు, పంట పొలాల వద్దకు రైతులు వెళ్లేటప్పుడు బోరు మోటర్ల వద్ద విద్యుత్ తీగలను సరిచూసుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్ళరాదని ఆయన ప్రజలకు సూచించారు. ఇంటిలో విద్యుత్ పరికరాలు వాడేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. దూర ప్రయాణాలు ప్రయాణించేటప్పుడు అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు వెళ్ళరాదని ఆయన సూచించారు.

# సత్తా చాటిన పుష్ప రాజ్..

## భారీ ధరకు పుష్ప 2 ఓటీటీ రైట్స్..



కబురు సినిమా సెప్టెంబర్ 02..

అల్లు అర్జున్ నటించిన 'పుష్ప 2' సినిమా కోసం బన్నీ అభిమానులు వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. 2021లో విడుదలైన పుష్ప సినిమా సంచలన విజయాన్ని అందుకుంది. కోవిడ్ తర్వాత విడుదలైన ఈ సినిమా భారీ హిట్ అందుకోవడంతో ఆ తర్వాత వచ్చిన సినిమాలన్నీ ఇలా పాన్ ఇండియా మూవీస్ గా రిలీజ్ అయ్యాయి. ఇక ఇప్పుడు పుష్ప 2 ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. దాదాపు రెండేళ్లు చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తికావడంతో సినిమా ప్రమోషన్‌కు ముందే రైట్స్ అమ్మకాలు మొదలయ్యాయి.'పుష్ప 2' సినిమా షూటింగ్ దాదాపు పూర్తికాగా, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకుంటోంది. ఈలోగా ఈ సినిమా సేల్ స్టార్ట్ కాగా ఈ సినిమా %ాు% రైట్స్ ని 'పుష్ప 2' సినిమా ప్రొడక్షన్ హౌస్ అయిన మైత్రి మూవీ మేకర్స్ భారీ మొత్తానికి అమ్మేసిందని తెలుస్తోంది. గతంలో 'పుష్ప' చిత్రాన్ని అమెజాన్ ప్రైమ్ ఓటీటీకి అమ్మేశారు. కానీ ఇప్పుడు మరో ఓటీటీ తో డీల్ సెట్ చేసుకున్నారు మేకర్స్. 'పుష్ప 2' OTT విడుదల హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. పుష్ప 2 అన్ని భాషల హక్కులు నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. ఇటీవల, పెద్ద సినిమాలు రెండు ఓటీటీలు అంటే నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్లాట్‌ఫారమ్‌లలో అమ్ముతున్నాయి. కానీ 'పుష్ప 2' సినిమా మాత్రం అలా కాకుండా కేవలం నెట్‌ఫ్లిక్స్‌కి మాత్రమే అమ్ముడైంది.అదే విధంగా 'పుష్ప 2' సినిమా OTT హక్కులను కొనుగోలు చేసేందుకు నెట్‌ఫ్లిక్స్ రూ. 270 కోట్ల రూపాయలు వెచ్చించింది. ఈ మధ్య కాలంలో ఇంత భారీ మొత్తం మరే సినిమాకు రాలేదని అంటున్నారు. ఇటీవల ఓటీటీకి వచ్చిన 'కల్కి 2898 ఏడీ' సినిమా హక్కులకు కూడా ఇంత భారీ మొత్తం ఇవ్వలేదని తెలుస్తోంది. 'పుష్ప' చిత్రం 2021లో ఓటీటీకి దాదాపు రూ.50 కోట్లకు అమ్ముడుపోగా, 'పుష్ప 2' ఏకంగా రూ.270 కోట్లకు అమ్ముడుపోయింది.ఆగస్ట్ 15న 'పుష్ప 2' సినిమా విడుదల కావాల్సింది కానీ వాయిదా పడింది. ఆ తర్వాత దసరా పండుగ సందర్భంగా సినిమాను విడుదల చేస్తాం అని చెప్పారు మేకర్స్. అయితే ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ చాలా టైం తీసుకుంటుండడంతో డిసెంబర్ లో సినిమా విడుదల కానుంది. సెప్టెంబర్‌లో ఫస్ట్ హాఫ్ ఎడిట్ పూర్తవుతుందని ఇటీవలే నిర్మాత తెలిపారు. నవంబర్‌లో సెకండ్ హాఫ్ ఎడిట్ రెడీ అవుతుంది. నవంబర్ నెలలో కొంత ఫైన్ ట్యూనింగ్ చేసిన తర్వాత నెలాఖరులో సెన్సార్ సర్టిఫికేట్ రానుంది. ఆ తర్వాత డిసెంబర్ మొదటి వారంలో సినిమా విడుదల కానుందని తెలుస్తోంది.

# ప్రజల గుండెల్లో నీ స్థానం సుస్థిరం

## పవన్‌కు చిరంజీవి శుభాకాంక్షలు



**ప్రజలకు ఈరోజుల్లో పవన్‌కల్యాణ్ లాంటి నాయకుడు కావాలని చిరంజీవి అన్నారు.**

పవన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఓ ప్రత్యేక ఫొటోను షేర్ చేశారు."కల్యాణ్ బాబు.. ప్రతీ సంవత్సరం నీకు పుట్టినరోజు వస్తుంటుంది. కానీ, ఈ పుట్టినరోజు మరీ ప్రత్యేకం. ఆంధ్ర ప్రజానీకానికి కావలసిన సమయంలో కావాల్సిన నాయకుడు వాళ్ల జీవితంలో పెను మార్పులు తీసుకురావడానికి వాళ్ల ఇంటి పెద్ద బిడ్డగా వచ్చాడు. రాజకీయాల్లో నీతి, నిజాయితీ, నిలకడ, నిబద్ధత కలిగిన ఒక నాయకుడిగా నిన్ను వాళ్ల జీవితాల్లోకి ఆహ్వానించారు. గుండెల్లో స్థానం ఇచ్చారు. అది సుస్థిరం. ఈ రోజుల్లో నీలాంటి నాయకుడు కావాలి, రావాలి. అద్భుతాలు జరగాలి. అది నువ్వు మాత్రమే చేయగలవు, చేస్తావనే నమ్మకం నాతో పాటు ఆంధ్ర ప్రజలందరికీ ఉంది. పుట్టిన రోజు శుభాకాంక్షలు. దీర్ఘాయుష్మాన్ భవ!" అని చిరంజీవి తన పోస్ట్‌లో పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా పవన్‌కల్యాణ్‌కు విషెస్ తెలుపుతూ సోషల్‌మీడియాలో పోస్ట్ పెట్టారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. ప్రజా జీవితంలో నిబద్ధతతో ఉండే నాయకుడిగా మరెన్నో మైలురాళ్లు దాటాలని ఆకాంక్షిస్తున్నా. చలనచిత్ర సీమలో తిరుగులేని కథానాయకుడిగా కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ఆయన రానున్న రోజుల్లో మరిన్ని అద్భుతాలు చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, భగవంతుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.




# ఆ పదమే నాకు ఇంపుగా వినిపిస్తుంది!

కబురు సినిమా సెప్టెంబర్ 02..

"భిన్నమైన దారుల్లో సాగించే ప్రయాణమే కొత్త అనుభూతిని పంచిస్తుంది. అందులోనే పరిపూర్ణమైన సంతృప్తి దొరుకుతుంది" అంటోంది అనుపమ పరమేశ్వరన్. అందుకే ఓ కంఫర్ట్ జోన్‌ను దాటి పని చేయడానికే మొగ్గు చూపుతానని చెబుతోంది ఈ మలయాళీ నాయిక. "సౌకర్యంగా ఉంది కదాని ఓ గిరి గీసుకొని ఆ జోన్‌లోనే పని చేయడం చాలా బోరింగ్‌గా ఉంటుంది. అందుకే నేనెప్పుడూ ప్రయోగాలు చేయాలనుకుంటా. ఏ పాత్ర చేసినా అందులో నటిగా నాకు సవాల్ విసిరే అంశాలు ఉన్నాయో లేదో వెతుక్కుంటా. ఇక సెట్లో దర్శకుడు రీటేక్స్ అడిగినప్పుడే నాకు చాలా నచ్చుతుంది. 'బాగా చేశావ'నే ప్రశంస కంటే ఆ పదమే నా చెవులకు ఇంపుగా వినిపిస్తుంది" అని చెప్పుకొచ్చింది అనుపమ.

# నేను చేసిన తప్పు.. రెండు నెలలు ఏడుస్తూనే ఉన్నా: విక్రమ్



కబురు సినిమా సెప్టెంబర్ 02..

'తంగలాన్' సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్నారు కోలీవుడ్ నటుడు విక్రమ్ .సక్సెస్ సెలబ్రేషన్స్‌లో భాగంగా ఆయన వరుస కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కెరీర్ ఆరంభంలో ఒక్కసారైనా మణిరత్నం దర్శకత్వంలో వర్క్ చేయాలని కలలు కన్నానని అన్నారు. ఆ ప్రాజెక్ట్ తర్వాత సినిమాలకు దూరమైనా బాధ ఉండదనుకున్నా."దర్శకుడు మణిరత్నం అంటే నాకెంతో ఇష్టం. ఆయన ఫిల్మ్ మేకింగ్ స్టైల్‌ను ఎంతగానో ఇష్టపడతా. కెరీర్ ఆరంభంలో ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని కలలు కనేవాడిని. ఆ సినిమా తర్వాత కావాలంటే రిటైర్మెంట్ ఇవ్వడానికీ నేను సిద్ధమే. ఈ క్రమంలోనే 'బొంబాయి' సినిమా ఆఫర్ వచ్చింది. హీరోగా నన్ను ఎంచుకున్నారు. ఫైనల్ ఆడిషన్‌లో చేసిన చిన్నతప్పు వల్ల ఆ సినిమా నా చేయి జారిపోయింది. సడెన్‌గా ఆయన నన్ను ఆడిషన్‌కు పిలిచారు. వీడియో కెమెరా కాకుండా స్టిల్ కెమెరా తీసుకువచ్చి.. సీన్ వివరించి యాక్ట్ చేయమన్నారు. మామూలు కెమెరా తీసుకువచ్చి యాక్ట్ చేయమంటారేంటి? ఎందుకు యాక్ట్ చేయాలి? అనిపించింది. అంతేకాకుండా స్టిల్ కెమెరా కావడంతో ఒకవేళ నేను కదిలితే పిక్చర్ బ్లర్‌గా వస్తుందనుకున్నా. అలాగే ఉండిపోయా. అలా అది నా చేజారిపోయింది. దాదాపు రెండు నెలలు నేను బాధపడ్డా. ప్రతిరోజూ ఉదయం నిద్ర లేవడం ఏడుస్తూ కూర్చోవడం ఇదే పని. ఆ తర్వాత అది పాన్ ఇండియా కల్ట్‌మూవీ అయ్యింది" అని విక్రమ్ చెప్పారు.కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ కార్మికుల జీవితాల ఆధారంగా దర్శకుడు పా.రంజిత్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా కోసం విక్రమ్ ఎంతగానో శ్రమించారు. మాళవిక మోహనన్, పార్వతి తిరువోతు కీలక పాత్రలు పోషించారు. ఎన్నో అంచనాల మధ్య ఆగస్టు 15న ఇది విడుదలై దక్షిణాదిలో మంచి సక్సెస్ అందుకుంది. ఆగస్టు 30న హిందీలో ఈ సినిమా విడుదలైంది. ఇప్పటివరకూ ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా వసూలుచేసింది.



# కాంతారలో నటించడానికి నేను సిద్ధమే!

కబురు సినిమా సెప్టెంబర్ 02..

మరికొద్దిరోజుల్లో 'దేవర'తో తెరపైకి రావడానికి సన్నద్ధమవుతున్నారు కథానాయకుడు ఎన్టీఆర్. ప్రస్తుతం ఆయన తన కుటుంబ సభ్యులు, దర్శకుడు ప్రశాంత్ నీల్‌తో కలిసి కర్ణాటక రాష్ట్రంలోని పలు దేవాలయాలను సందర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా కన్నడ హీరో రిషబ్ శెట్టితో కలిసి కొల్లూరిలోని మూకాంబిక అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 'మీరు 'కాంతార' ప్రీక్వెల్‌లో నటిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. దానిపై మీ స్పందనేంటీ" అని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు ఎన్టీఆర్ తనదైన శైలిలో బదులిస్తూ.. "ఇదంతా రిషబ్ శెట్టి చేతిలోనే ఉంది. ఆయన ప్లాన్ చేస్తే.. నేను ఇందులో నటించడానికి సిద్ధమే" అన్నారు. దీంతో ఎన్టీఆర్ 'కాంతార' ప్రీక్వెల్‌లో నటిస్తున్నాడంటూ అభిమానుల్లో ఊహాగానాలు మొదలయ్యాయి. మరి రిషబ్‌శెట్టితో కలిసి ఎన్టీఆర్ తెరను పంచుకోనున్నారో లేదో అనేది తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com